క్లుప్తంగా

ఆర్థిక సాయం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని రామాపురం తండాకు చెందిన లక్ష్మానాయక్, 89 పెద్దూరు గ్రామానికి చెందిన సంపత్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలకు పూలమాలలు చేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచ్ మల్లిక, నేతలు గోవిందప్ప, కేశవరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం



పుంగనూరు: శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధులు శనివారం అన్నదానం చేశారు. పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో ఆర్‌టీఎఫ్ కన్వీనర్ పూల హేమంత్‌రాయల్, జనార్ధన్, పెద్ద మణి, భాస్కర్ తదితరులు కలిసి పేదలకు అన్నదానం చేశారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నానబాలకుమార్, రాయలకుమార్, మల్లికార్జునరాయల్, అనిల్ రాయల్, లోహిత్‌రాయల్, చందురాయల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఎస్‌డీపీఐ పోటీ

పుంగనూరు: వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థులు పోటీచేస్తారని ఎస్‌డీపీఐ పార్టీ అధ్యక్షుడు జమీర్‌లాల్ తెలిపారు. ఆయన శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్‌గని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. త్వరలో అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 15 సంవత్సరాలుగా ప్రజాసేవలో కొనసాగుతున్న ఎస్‌డీపీఐ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు యూసుఫ్, షామూభారక్, సిద్దిక్, అతిక్, ఖాదర్, సద్దాం, బాబా తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలతో అలీమ్‌బాషా, అమ్ము, షరీఫ్

పుంగనూరు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఇందులో భాగంగా పుంగనూరు పట్టణంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 2వ సచివాలయం చంద్రమౌలి మార్కెట్ జట్టు, రొంపిచెర్ల జట్టు తలపడ్డాయి. ఇందులో పుంగనూరు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ విజేతలను అభినందించారు. వారికి బహుమతులు అందజేశారు.

272 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ అరుణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 272 మందికి వైద్య సేవలు చేసి మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారులు నందిని, గ్రీష్మ బిందు, శ్యామలాదేవి తెలిపారు. 12 మందిని కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మునిరాజ, పీఏస్‌లు జఫ్రుల్లా, గణపతి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



కుప్పం రూరల్: కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో 22వ తేదీన రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. శవాన్ని తీసుకుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు డీకేపల్లి మాజీ సర్పంచ్ మణికి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం మణి, రైల్వే పోలీసులు కలిసి వృద్ధురాలి మృతదేహాన్ని ఖననం చేశారు.

దుష్టశక్తులను కలిసికట్టుగా అడ్డుకుందాం

- గజదొంగల ముఠాకు, ప్రజాకూటమికి మధ్య సాగుతున్న యుద్ధమిది
- సంక్షేమ సారథిని కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలదే
- నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సభలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి /పలమనేరు: వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఎలాగైనా ఓడించాలని దుష్టశక్తులు ఏకమయ్యాయని, వాటిని అందరూ కలిసి అడ్డుకుందామని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. పెద్దపంజాణి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే వెంకటేగౌడ, సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెద్దపంజాణి మండలానికి నాలుగో విడత 1,111 సంఘాల్లోని 10,641 మంది సభ్యులకు మంజూరైన రూ.11,17,81 మెగా చెక్కును మహిళా గ్రూపులకు అందజేశారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు గజదొంగల ముఠాకు ప్రజాకూటమికి మధ్య సాగుతున్న యుద్ధంగా భావించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలన్నారు.

మహిళలను నట్టేట ముంచిన చంద్రబాబు

పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తానని, ఒక్క రూపాయి కూడా కట్టొద్దని చెప్పి చంద్రబాబు నిలువునా ముంచారని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో 600లకు పైగా హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు. తమ గ్రామాల్లో కనిపిస్తున్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడులు గతంలోనూ, నేడు ఎలా ఉన్నాయో చూడాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే మీ అందరి దీవెనలు ప్రభుత్వానికి అవసరమని మహిళలను కోరారు. పెద్దపంజాణి మండలానికి ఆసరా నాలుగు విడతలో సుమారు రూ.45 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. తన సొంత గ్రామం తోటకనుమలో ప్రస్తుత ప్రభుత్వంలో 300 ఇళ్లు ఇచ్చామని, మాజీమంత్రి అమరనాథ రెడ్డి కనీసం పది ఇళ్లయినా ఇచ్చారా అని నిలదీశారు. సొంతూరిని గాలికొదలి తమ గ్రామంలో అభివృద్ధి లేదని విమర్శించడం సిగ్గుచేటన్నారు. అనంతరం సీఎం చిత్ర పటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు.

చంద్రబాబును నమ్మకండి

చంద్రబాబునాయుడు అధికారం కోసం ఎన్ని అబద్ధాలైన ఆడతారని, ఆయనను నమ్మొద్దని పలమనేరు కో–ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షుడు సుబాష్ చంద్రబోస్ తెలిపారు. తాను టీడీపీలో చంద్రబాబుకంటే సీనియర్‌నని గుర్తు చేశారు. గతంలో పలమనేరులో టీడీపీ అభ్యర్థుల గెలుపుకోసం చాలా కష్టపడ్డానన్నారు. 2009లో ఈ స్థానం జనరల్ కేటాయించగా సీటు తనకివ్వకుండా ప్రజారాజ్యంలోకి వెళ్తానని బెదిరించిన అమరనాథరెడ్డికి ఇచ్చారని పేర్కొన్నారు. అమరనాథరెడ్డి 2014లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి కోసం టీడీపీలో చేరారని వివరించారు. ఈ దఫా ఆయన్ను గెలిపిస్తే మళ్లీ ఏ పార్టీలోకి వెళతాడో జనం తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు మోసకారని, అందుకే జగనన్న బాటలో నడుస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, మాజీ చైర్మన్ శంకరప్ప, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఏఎంసీ డైరెక్టరు సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, ఎంపీడీవో అబ్దుల్ రహీమ్, ఏపీఎం క్రిష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు, డ్వాక్రా మహిళలతో కలసి సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

జగనన్నతోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఆయన శనివారం శాంతిపురంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో 65 శాతానికి పైగా ఉన్న బీసీలను చంద్రబాబు 35 ఏళ్లుగా అణగదొక్కుతూ అధికారం చలాయిస్తున్నారని చెప్పారు. జయహో బీసీ పేరుతో సభలు పెట్టి బీసీలతో బీసీలనే తిట్టిస్తున్నారని వాపోయారు. జెడ్పీటీసీ శ్రీనివాసులు మాట్లాడుతూ వెనకబడిన కులాల వారు ఐక్యంగా ఉంటే తమ పెత్తనం సాగదని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న మాట్లాడుతూ టీడీపీలోని బీసీ నాయకులు చంద్రబాబు కుతంత్రాలను తెలుసుకోవాలని హితవుపలికారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ సుకుమార్, ఎంపీటీసీలు ఆర్ముగం, చలపతి, సర్పంచ్ చంగమరాజు, బీసీ నాయకులు వీరభద్రప్ప, సంపంగి, రమణప్ప, సుబ్రమణ్యం, కృష్ణ, చలపతి, గోపి, మురుగేష్, మణి పాల్గొన్నారు.

ఉపాధిహామీ రైతులకు వరం

వి.కోట: ఉపాధి హామీ పథకం రైతులకు వరమని ఎంపీపీ యువరాజు తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద ఆదివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో పంచాయతీల వారిగా ఉపాధి హామీలో చేసిన పనులన పరిశీలనలో తేలిన వివరాలు వెల్లడించారు. ఎంపీడీవో మహ్మద్ రఫీ, ఏపీవో అశోక్‌కుమార్, ఉపాధిహామీ పథక సంచాలకులు గంగాభవాని, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తూ..



రామకుప్పంలోని టీదుకాణంలో టీ తాగుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ శనివారం రామకుప్పంలో ఇంటింటా పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. రామకుప్పంలో నూతనంగా వేసిన సిమెంటు రోడ్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక గోవిందా టీ అంగడిలో ప్రజలతో కలిసి టీ తాగారు. ఎమ్మెల్సీ తమతో కలిసి టీ తాగడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు అభినందనలు



పవిత్ర, మురళీకృష్ణ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నాయకులు

పెద్దపంజాణి/పలమనేరు: రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పలమనేరు పట్టణానికి చెందిన పవిత్రను శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులతోపాటు పెద్దపంజాణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్ అభినందించి సన్మానించారు. అభినందనలు తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులకు మంత్రి పెద్దిరెడ్డి శంకుస్థాపన

పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పుంగనూరులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, కొత్త పనులకు భూమిపూజ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీలో 600 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. నెక్కుంది అగస్తీశ్వర స్వామి ఆలయంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తారు. పట్టణ సమీపంలోని బైపాస్‌రోడ్డులో ఆర్డీవో కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. రాంపల్లెలో మసీదును ప్రారంభిస్తారు. గూడూరుపల్లెలో నిర్మించనున్న బ్రాహ్మణ కమ్యూనిటీ, రోటరీ, మానవతా స్వచ్ఛంద సంస్థ, వాల్మీకి, రైతు భవనాల నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. పలు వివాహ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు.

వలసల నివారణకే ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీ ఎన్.రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల వలసల నివారణ కోసమే ఉపాధి హామీ పనులు చేస్తున్నట్టు ఎంపీ ఎన్.రెడ్డెప్ప తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఉపాధి హామీ కింద రూ.8.84 కోట్లతో చేపట్టిన 1760 పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించినట్టు ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ తెలిపారు. ఇందులో నెల్లిపట్ల, గడ్డూరు, కమ్మనపల్లె తదితర గ్రామాల్లో సుమారు రూ.2.18 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. డ్వామా పీడీ గంగాభవానీ, డీఈవో భాగ్యలక్ష్మీ అవినీతి పరులపై చర్యలు తీసుకుని రికవరీకి ఆదేశించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, ఏపీవో హరినాథ్, సామాజిక బృందం పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలు బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి జట్లు



బాల్ బ్యాడ్మింటన్‌లో విజేత జట్టు బైరెడ్డిపల్లి



ఖోఖో విజేతలు వి.కోట, పెద్దపంజాణి జట్లు



ఖోఖో బాలికల విభాగం విజేతగా వి.కోట, రన్నర్‌గా నిలిచిన గంగవరం జట్లు

పలమనేరు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో బైరెడ్డిపల్లి, మహిళల విభాగంలో పెద్దపంజాణి జట్లు విజేతలుగా నిలిచాయి. ఐదు మండలాలకు చెందిన ఐదు జట్లు ఇందులో పాల్గొన్నాయి. బ్యాడ్మింటన్ పోటీల్లో మహిళా విభాగంలో రన్నర్స్‌గా పలమనేరు, పురుషుల విభాగంలో రన్నర్స్‌గా పలమనేరు నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో విన్నర్‌గా వి.కోట, రన్నర్‌గా పెద్దపంజాణి, ఖోఖో బాలికల విభాగంలో విన్నర్‌గా వి.కోట, రన్నర్‌గా గంగవరం జట్లు నిలిచాయి. నియోజకవర్గ స్థాయి పోటీల్లో భాగంగా ఈ నెల 29న క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు స్థానిక ఆర్‌డీవో, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లలకు తొలి స్థానానికి రూ.35 వేలు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానానికి రూ.5 వేల తోపాటు షీల్డ్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ గోవర్ధన్‌రెడ్డి, కిశోర్ నాయక్, ఎంపీడీవో విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలానికి మంత్రి పెద్దిరెడ్డి రాక

వి.కోట: మండలంలో ఆదివారం నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నట్టు ఎంపీపీ యువరాజు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సభ నిర్వహిస్తామన్నారు. సమావేశ ప్రదేశాన్ని ఎంపీపీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు.

అమ్మవారి సేవలో ఆర్టీసీ విజిలెన్స్ డీఎస్పీ



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను శనివారం ఆర్టీసీ విజిలెన్స్ డీఎస్పీ ధర్మతేజ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం అర్చకులు అమ్మవారి ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎర్రోనిగుట్టలో తీరిన తాగునీటి సమస్య



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గంగవరం: మండలంలోని ఎర్రోనిగుట్టలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం బోరును ప్రారంభించి ప్రజలకు నీరు అందించారు. పసుపత్తూరు పంచాయతీ ఎర్రోనిగుట్ట వాసులకు గొర్రెలదొడ్డి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారు. వేసవిలో సక్రమంగా నీరు వచ్చేది కాదు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే వెంకటేగౌడకు స్థానికులు తాగునీటి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మె ల్యే, జెడ్పీ చైర్మన్ వెంటనే జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో బోరు మంజూరు చేయించారు. పుష్కలంగా నీరు పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి బోరును ఎంపీపీ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, గిరిరాజారెడ్డి, సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ కస్తూరమ్మ ప్రారంభించారు.

జగనన్నతోనే మహిళా సాధికారత



రేగడదిన్నేపల్లిలో మహిళలతో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ

శాంతిపురం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళా సాధికారత సాకారమైందని ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ చెప్పారు. ఆమె శనివారం 121–పెద్దూరు, రేగడదిన్నేపల్లి, చెంగుబళ్ల, కోనేరు కుప్పం పంచాయతీల్లో జగనన్న కోసం జనం– భరత్ అన్నతో మనం కార్యక్రమం నిర్వహించారు. మహిళలను నేరుగా కలిసి వారికి చీర, పసుపు, కుంకుమ అందజేశారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా నగదును నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. అక్కచెల్లెమ్మలపై అపారమైన విశ్వాసం ఉన్న జగనన్నను, ఆయన పార్టీ అభ్యర్థులను మహిళలు ఆశీర్వదించాలని కోరారు. కరోనా కష్టకాలంలో జగనన్న, ఎమ్మెల్సీ భరత్ జనానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. మంచి చేసిన వారిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమ్మ, సర్పంచులు వెంకట్రామరెడ్డి, గోపాల్, భాస్కర్, రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు రవికుమార్, వనిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చను ఆదరించండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 29న జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని చూపించేలా ఏర్పాట్లు చేసి, ఆదరించాలని బీజేపీ నాయకులు కొల్లా చిట్టిబాబు డీఈఓను కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం డీఈఓ విజయేంద్రరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన డీఈఓతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాదిలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని ఢిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులతో మాట్లాడతారని చెప్పారు. దీన్ని జిల్లాలోని సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు వీక్షించేలా చర్యలు చేపట్టాలని డీఈఓకు విన్నవించారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

పలమనేరు: పట్టణంలోని గంగమ్మ గుడి ఆడిటోరియంలో శనివారం స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన త్యాగరాజు కీర్తనలు శ్రోతలను అలరించాయి. త్యాగరాజు ఆరాధనోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు సాయితేజస్ చంద్రశేఖర్ కీర్తనలు ఆలపించారు. వారికి నాగరాజు మృదంగం, సచిన్‌దేవీప్రసాద్ ఘటం, అర్జున్ దినకర్ వయలిన్‌తో సహకరించారు. ధనుంజయ, వాణి, రాఘవేంద్ర, తులసీనాథం నాయుడు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెద్దపంజాణి: మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఎంఈవోలు గోపాల్‌రెడ్డి, తులసీరాం ఎస్టీయూ– 2024 సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని విద్యాశాఖాధికారులు, యూనియన్ల సమన్వయంతో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. చిత్తూరు పట్టణంలో ఆదివారం జరిగే ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు జయరామప్ప, సీనియర్ నాయకుడు మార్రెడ్డి భాస్కర్, మండల నాయకులు నారాయణస్వామి, అంజాద్ అలీఖాన్, శివప్రకాష్ బాబు పాల్గొన్నారు.

రూ.3.25 కోట్లతో కన్వెన్షన్ హాల్ నిర్మాణం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కన్వెన్షన్ హాల్

చౌడేపల్లె: పుంగనూరు మండలం నెక్కుంది సమీపంలోని ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్తీశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజల కోసం రూ.3.25 కోట్లతో కన్వెన్షన్ హాల్ నిర్మించినట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆయన శనివారం జెడ్పీటీసీ దామోదరరాజు, రామనారాయణరెడ్డి, సర్పంచ్ రిజ్వానాతో కలిసి ఆలయం వద్ద మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అగస్తీశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవ తో సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఏ.కొత్తకోట నుంచి కొండ పైకి రోడ్డు సౌకర్యం, పుష్కరిణి ఆధునీకరణ చేస్తున్నట్టు తెలిపారు. పుంగనూరు, చౌడేపల్లె, పెద్దపంజాణి మండలాల ప్రజలు శుభకార్యాలకు కన్వెన్షన్ హాల్‌ను వియోగించుకునేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. హాల్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.

16న రథసప్తమి వేడుకలు

తిరుపతి(అలిపిరి): వచ్చే నెల 16వ తేదీన తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా అమ్మవారు ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 8.15 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 8.45 నుంచి 9.45 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

కేజీబీవీ స్కౌట్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో స్కౌట్ విద్యార్థులు

రామకుప్పం: చిత్తూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో రామకుప్పం కేజీబీవీ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. కవాతులో చేసిన ఉత్తమ ప్రదర్శనకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందుకున్నారు. విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి, పీఈటీ సంధ్య అభినందించారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కుప్పం రూరల్: కుప్పం పట్టణం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మోడల్ కాలనీకి చెందిన వెంకటాచలం బైక్‌లో పట్టణం వైపు వస్తున్నాడు. ఎంఎల్‌ఆర్ డ్రింక్స్ వద్ద వాహనం అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

గోపాల మిత్రకు ప్రశంసా పత్రం



రామకుప్పం: ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అత్యధికంగా గో కృత్రిమ గర్భధారణకు కృషి చేసిన బల్ల ఆర్బీకే గోపాలమిత్ర దామసుందర్‌కు ప్రశంసా పత్రం అందింది. ఢిల్లీలో శుక్రవారం గణతంత్ర దినోత్సవంలో ప్రశంసా పత్రం అందుకున్నట్లు దామసుందర్ తెలిపారు. భారత ప్రభుత్వం ప్రత్యేకించి గ్రామాల్లో పశువులకు సేవ చేసే వారిని గుర్తించి ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. దామసుందర్‌ను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం అభినందించారు.